క్లుప్తంగా

ప్రశాంతగా పండుగ జరుపుకోవాలి



గౌతాపూర్ గ్రామ యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ యాదగిరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): త్వరగో రానున్న వినాయచవితి పండుగను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకోవాలని ఎస్ఐ యాదగిరి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని గౌతాపూర్ గ్రామ యువకులకు వినాయక మంటపాలు, తదితర ఏర్పాట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న వినాయక మంటపాల వివరాలు పోలీస్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. మంటపాల వద్ద ఏర్పాటు చేసే డీజే, తదితర కార్యక్రమాల కోసం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన ఏఓగా కృష్ణ నియామకం

పెద్దశంకరంపేట(మెదక్): మండల నూతన ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిగా నాగం కృష్ణ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఇన్‌చార్జి ఏఓ యాదగిరి బదిలీపై నార్సింగ్ మండలానికి వెళ్లగా, జిల్లా కేంద్రం నుంచి కృష్ణ పెద్ద శంకరంపేట ఇన్‌చార్జి ఏఓగా బాధ్యతలు చేపట్టారు.

సొంత నిధులతో డ్రైనేజీ నిర్మాణం



నర్సాపూర్‌లో సీసీరోడ్డు, మురికి కాల్వ పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్

నర్సాపూర్: ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారి ఇబ్బందులు దూరం చేయాలన్న ఉద్దేశ్యంతో మున్సిపాలిటీ పరిధిలోని పదోవార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ తన సొంత నిధులతో పనులు చేపట్టారు. తన వార్డులో సీసీరోడ్డు, మురికి కాల్వ నిర్మాణానికి సుమారు రూ.రెండు లక్షలు వెచ్చించి.. పనులు చేశారు. బుధవారం ఆ నిర్మాణ పనులు పరిశీలించారు.

అమరవీరులకు ఘన నివాళి



విద్యుత్ అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మెదక్ కలెక్టరేట్: విద్యుత్ సమస్యలపై పోరాడి హైదరాబాద్ బషీర్ బాగ్ వద్ద ప్రాణాలు వదిలిన అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సంతోష్ పిలుపునిచ్చారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో విద్యుత్ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్ పోరాట అమరుల త్యాగం స్ఫూర్తిగా ప్రజా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అజయ్, సత్యం, భానుచందర్, సిద్ధూ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ కళాశాల మైదానంలో క్రీడాపోటీలు



మాట్లాడుతున్న పోచయ్య

చిన్నశంకరంపేట(మెదక్): పాఠశాల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలను గురువారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

నేడు రంగంపేటలో 2కే రన్

కొల్చారం(నర్సాపూర్): జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని రంగంపేటలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీధర్ రెడ్డి బుధవారం తెలిపారు.

ఇంటింటా రుణమాఫీ సర్వే



వెంకట్రావుపల్లిలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఓ ప్రవీణ్‌కుమార్

చేగుంట(తూప్రాన్): అర్హత ఉండి రుణమాఫీ జరగని రైతుల వివరాల కోసం వ్యవసాయ అధికారులు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని బీకొండాపూర్‌లో రైతుల సర్వే నిర్వహించారు. మండలంలో 629 మంది రైతులకు రుణమాఫీ జరగలేదని అర్హత ఉండి, రేషన్‌కార్డు లేని రైతుల వివరాల సేకరణ కోసం గ్రామాల్లో సర్వే చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి హరిప్రసాద్ తెలిపారు. రైతుల వివరాలను ఉన్నతాధికారులు రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారితో పాటు ఏఈఓ ప్రవీణ్ పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): రైతు రుణమాఫీ ప్రక్రియలో భాగంగా మండల కేంద్రంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్నట్లు ఏఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని చెన్నాయిపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ పరిశీలించి, అవసరమైన పత్రాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు ఇంటికి వెళ్లి ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస ఉన్నారు. నార్సింగి మండల కేంద్రంలో రైతురుణమాఫీ ప్రక్రియలో భాగంగా రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఏఓ యాదగిరి తెలిపారు. మండలంలో 266 మంది రైతుల కుటుంబ వివరాలు నమోదు చేయాల్సి ఉందన్నారు. ఆయన వెంట ఏఈఓ విజృంభణ, దివ్య ఉన్నారు.

రుణమాఫీ నిర్ధారణ సర్వే అంతంతే..

కొల్చారం(నర్సాపూర్): రుణమాఫీలో భాగంగా కుటుంబ నిర్ధారణ సర్వే మండలంలో మొదటి రోజైన బుధవారం అంతంతగానే సాగింది. షెడ్యూల్ ప్రకారం అంసాన్‌పల్లి, నాయిని జలాల్‌పూర్ గ్రామాల్లో సర్వే నిర్వహించాలి. సర్వే కోసం వ్యవసాయ అధికారులు వస్తారన్న సమాచారం ఆయా గ్రామాల్లో లేకపోవడంతో అంసాన్‌పల్లిలో సర్వే కోసం వెళ్లిన వ్యవసాయ అధికారులకు ఒకే ఒక్క రైతు మాత్రమే అందుబాటులో ఉండడంతో సర్వే పూర్తి చేసుకొని తిరిగి వచ్చారు.

కంచన్‌పల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రుణమాఫీ సర్వే చేస్తున్నారు. బుధవారం ఏఓ స్వప్న ఆధ్వర్యంలో మండలంలోని కౌడిపల్లి ధర్మాసాగర్, మహ్మద్‌నగర్, కన్నారం, కంచన్‌పల్లి గ్రామాల్లో రేషన్‌కార్డు లేని కుటుంబాలను సర్వే చేసినట్లు చెప్పారు. మండలంలో రేషన్‌కార్డు లేని వారు మొత్తం 433మంది రైతులు ఉన్నారని చెప్పారు. గ్రామాలవారీగా ఇంటింటికీ తిరిగి సర్వే చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఓలు సాహితి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



బీకొండాపూర్‌లో వివరాలను ఫోన్‌లో నమోదు చేసుకుంటున్న మండల వ్యవసాయ అధికారి



కౌడిపల్లి(నర్సాపూర్): కంచన్‌పల్లిలో రైతు రుణమాఫీ సర్వే చేస్తున్న ఏఓ స్వప్న



నార్సింగి మండల కేంద్రంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఓ యాదగిరి

అఘాయిత్యాలు జరిగితే ఫిర్యాదు చేయండి

సఖి కేంద్రం ప్రతినిధి కళావతి

రామాయంపేట(మెదక్): అఘాయిత్యాలు జరిగితే వెంటనే సఖి కేంద్రంలో ఫిర్యాదు చేయాలని సఖి కేంద్రం ప్రతినిధి కళావతి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి గ్రామ శివారులో ఉన్న మోడల్ స్కూలు, కస్తూర్బా స్కూల్‌లో బుధవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మెదక్ సఖీ కేంద్రం సభ్యులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యాచారాలు, యాసిడ్ దాడులు, లైంగిక వేధింపులు జరిగితే వెంటనే సఖి కేంద్రంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలపై దాడులు, హింస జరిగితే రెస్క్యూ వాహనంలో తీసుకెళ్లి, వారికి సపర్యలు చేస్తామని తెలిపారు. మహిళలు, విద్యార్థినులు పోకిరీలకు భయపడొద్దని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో 181, 112, 1098 నంబర్లకు ఫోన్‌చేయాలని అన్నారు. కార్యక్రమంలో పారామెడికల్ మంజుల, రెండు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సఖి ప్రతినిధి కళావతి

మానసిక స్థితి లేని యువతి అదృశ్యం

రామాయంపేట(మెదక్): మండలంలోని తొనిగండ్ల గ్రామానికి చెందిన 23 ఏళ్ల యువతి మౌనిక అదృశ్యమైంది. మంగళవారం ఆమె తండ్రి ఒత్తుగారి సుధాకర్, తల్లి ఎల్లవ్వ తెలిపిన వివరాల ప్రకారం.. తల్లిదండ్రులు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి రాత్రి ఇంటికి వచ్చేటప్పటికీ పెద్ద కూతురు మౌనిక కనిపించలేదు. తమ కూతురు జాడకోసం అంతటా వెతికినా.. ఆచూకీ లభించలేదు. దీంతో వారు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా మౌనిక మానసిక పరిస్థితి సరిగా లేదని పేర్కొన్నారు. సీఐ వెంకట్ రాజాగౌడ్, ఎస్ఐ బాల్‌రాజ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మౌనిక

గెమ్‌సింగ్ తండాలో చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని బిక్య పంచాయతీ గెమ్‌సింగ్ తండాలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. తండాకు చెందిన లాల్‌సింగ్ ఇంటికి తాళం వేసి మంగళవారం షాపూర్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలోని దుస్తులు, పలు వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. రూ.10 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు లాల్‌సింగ్ చెప్పాడు. చోరీ స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.



చిందర వందరగా దుస్తులు

హెచ్ఐవీకి మందులేదు.. నివారణే మార్గం

గజ్వేల్‌రూరల్: హెచ్ఐవీకి మందు లేదు.. నివారణే ఒక్కటే మార్గమని పలువురు వక్తలు పేర్కొన్నారు. గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ కో–ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాలలో బుధవారం భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్ డిగ్రీ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, ప్రోగ్రాం ఆఫీసర్లకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నిక్కత్ అంజుమ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఎక్కువగా యువతే హెచ్ఐవీ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై స్నేహపూర్వకంగా ఉండాలని, ఉచితంగా మందులతో పాటు పింఛన్, రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి మల్లారెడ్డి, అధ్యాపకులు భవాని, అధ్యాపకులు కస్తూరి, జయరాజు, మహేందర్, రామచంద్రం, పెద్దిరాజు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి

మిరుదొడ్డి(దుబ్బాక): బీజేపీ సభ్యత్వమే లక్ష్యంగా స్థానిక సమస్యలపై పోరాడుతూనే రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా సభ్యత్వ కన్వీనర్ మల్లన్నగారి భిక్షపతి పిలుపునిచ్చారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు ఆధ్వర్యంలో బుధవారం మిరుదొడ్డిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఆరు వేల సభ్యత్వాలే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సురేశ్, సదానంద రెడ్డి, భాను, నాయకులు స్వామి, రవి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భిక్షపతి

ఆర్థికసాయం అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): అనారోగ్యంతో మృతిచెందిన బాధిత కుటుంబాలకు జడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా బుధవారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని చండి గ్రామానికి చెందిన ఉప్పరి బాలయ్య, భూపాల్ అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.5 వేల చొప్పున నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, ముత్యంరెడ్డి, బాలాగౌడ్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మృతి

దుబ్బాక: ఐదు రోజుల క్రితం బోడోనికుంటలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిన వ్యక్తి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఎస్ఐ గంగరాజు తెలిపారు. దుబ్బాకలోని డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన రియాజ్ తన స్నేహితుడు శివతో కలిసి బోడోనికుంటలో 24న కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రియాజ్ నీటిలో పడి మునిగిపోయాడు. దీంతో అతడి స్నేహితుడు రియాజ్‌ను బయటకు తీసి ఆసుపత్రికి తరలించాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రియాజ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

నంది అవార్డు గ్రహీతకు సన్మానం

కొండపాక(గజ్వేల్): ఇటీవల బంగారు నంది అవార్డు అందుకున్న కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కూరెళ్ళ శ్రీనివాస్ రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. విద్యాపరంగా ఆయన అందించిన సేవలకు నంది అవార్డు అందుకున్నారు. పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా కొండపాక బాలుర హైస్కూల్‌కు వెళ్లిన ఆయనను ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సముద్రాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పీఆర్టీయూ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సిబ్బంది సహకారం ముఖ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్యాలయ సిబ్బంది సహకారం ఎంతో ముఖ్యమని తహసీల్దార్ కమలాద్రి అన్నారు. బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలపై జవాబుదారితనం ఉండాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండల తహసీల్దార్‌గా కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని ఏవైన భూ సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ఆర్ఐలు కిషన్, సునీల్, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్

మహావృక్షం తొలగించొద్దు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ గ్రామ నడిమధ్యలో ఉన్న ఏళ్లనాటి వేప చెట్టును తొలగిస్తున్నారనే సమాచారం గ్రామంలో చర్చకు దారి తీసింది. బుధవారం ఉదయం ఖాజాపూర్ పరిరక్షణ కమిటీ వాట్సాఫ్ గ్రూప్‌లో గ్రామపంచాయతీ సిబ్బంది చెట్టును తొలగిస్తున్నట్లు మేసేజ్ పెట్టారు. చెట్టును తొలగించి అదే స్థలంలో మహనీయుడి విగ్రహం పెట్టనున్నట్లు తెలిపారు. దీంతో గ్రామ యువకులు స్పందిస్తూ.. ఎన్నో ఏళ్లనాటి మహావృక్షం తొలగించొద్దు అని చర్చకు తెరదీశారు. అసలే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నాం. అవసరమైతే విగ్రహం పెట్టకున్నా సరే చెట్టును మాత్రం తొలగించవద్దని గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో స్పందించడంతో సిబ్బంది వెనక్కు తగ్గారు. చెట్టు కొమ్మలను తొలగించి సరిపెట్టారు.



ఖాజాపూర్‌లోని మహావృక్షం

సైబర్ నేరాలపై అవగాహన

నిజాంపేట(మెదక్): మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్గి ఉండాలని ఎస్ఐ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నంది గామలో ఉన్న గుడ్ షెఫర్డ్ స్కూలులో బుధవారం మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై విద్యార్థులకు ఎస్ఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం విషయమై విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను చైతన్యపర్చాలని, వాటికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు అమ్మినా, వినియోగించినా తమకు సమాచారం అందజేస్తే, వారి వివరాలు రహస్యంగా ఉంచుతామని చెప్పారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరెడ్డి

విద్యార్థులకు క్రీడా పోటీలు



టేక్మాల్‌లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ శారద , ఉపాధ్యాయులు వెంకటేశ్, రాజు, మనోహర్‌తో పాటు విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు క్రీడలు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఎస్‌జీఎఫ్ క్రీడలను హెచ్ఎం రాజేంద్రప్రసాద్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. అండర్ 14, అండర్ 17 బాలికలకు ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ సౌజన్యంతో బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీఈటీలు దాసరి మధు, గజేంద్రుల నర్సింలు, శ్రీవిద్య, కల్యాణి, రజిని, రేణుక తదితరులు పాల్గొన్నారు.



చేగుంట ఉన్నత పాఠశాలలో ఖోఖో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా శోభాయాత్ర



శోభాయాత్రలో భక్తులు

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని వెంకటరావుపేటలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని వేణుగోపాల స్వామి దేవాలయంలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో డప్పు చప్పుళ్ళు, బాజా భజంత్రీలు, కోలాటాల మధ్య ఘనంగా శోభా యాత్ర నిర్వహించారు. చిన్నారులు శ్రీ కృష్ణుడి వేశధారణలో ఉట్లను ఉత్సాహంగా కొట్టడంతో భక్తులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో అర్చకులు రాజు చార్యులు, సత్యనారాయణా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు విరాళం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పాంబండ గ్రామంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తా బుధవారం విరాళం అందజేశాడు. గ్రామంలో కొలువైన గరిగెళమ్మ ఉత్సవాల నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు నవీన్‌గుప్తా రూ.10 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభులింగంగౌడ్, గణేశ్, అరుణ్, శివులు, మైసయ్య, తదితరులు ఉన్నారు.